# మొదటి దొంగతనం

**వాణిశ్రీ**

ప్రశాంతినగర్ కాలనీ ప్రశాంతంగా వుంది. రాత్రి పదికావొచ్చింది. ఆకాశంలో నల్లటి మబ్బులు కమ్ముకుని ఇప్పుడో ఇంకాసేపటికో వర్షం కురిపించేలా బెదిరిస్తు న్నాయి. మెరుపులు మెరుస్తూ సింహాల్లా గర్జిస్తున్నాయి.

రామకృష్ణకి అప్పటికే నిద్ర పట్టేసింది. శిరీష వంటగదిలో సామాన్లు సర్దుతోంది.

రామకృష్ణ సెల్ 'నీవేనా నను పిలిచినదీ, నీవేనా నను తలచినదీ' అనే పాట మొదలుపెట్టింది.

రామకృష్ణ కళ్ళు తెరిచాడు. "ఇప్పుడెవడ్రా బాబూ! రింగ్ చేసింది" అని విసుక్కుంటూ సెల్ తీసి "హలో" అన్నాడు. అవతల వ్యక్తి చెప్పిన మాటలు విని అతనికి నిద్ర మత్తు వదిలి పోయింది. హడావుడిగా డ్రెస్ చేసుకున్నాడు.

"శిరీ..శిరీ.." అని కేక పెట్టాడు.

ఇప్పటివరకూ లుంగీకట్టుకుని బెడ్‌మీద నిద్రపోతున్న రామకృష్ణ సడెన్‌గా డ్రెస్ చేసుకుని కనిపించేసరికి శిరీష ఆశ్చర్యపోయింది. ఎక్కడికో బయల్దేరబోతున్నాడని ఆమెకి అర్థమైంది.

"శిరీ...మా యమ్.డీ కారుకి యాక్సిడెంటైందట. హాస్పటల్లో చేర్చారట" అన్నాడు టెన్షన్ పడుతూ.

"హాస్పటల్లో చేర్చారా? ఎవర్ని కారునా?" అన్నది.

"జోకులు ఆపు. నేను వెళ్ళి చూసొస్తాను. నువ్వు తలుపులు వేసుకో. ఎవరు బెల్ కొట్టినా తియ్యకు. నేను ఇంటికి వచ్చి నీ సెల్‌కి రింగిస్తాను. అప్పుడు తియ్యి" అన్నాడు బయల్దేరుతూ.

"ఇప్పుడు టైమ్ పదైంది. మీరెప్పుడు వస్తారో? నిద్రమధ్యలో డిస్టర్బ్ చేస్తే ఆనక మళ్ళీ నిద్రపట్టదు. మీరు డోర్ లాక్ చేసుకుని వెళ్ళండి. ఎప్పుడొచ్చినా ఇబ్బంది లేదు. నిద్ర డిస్టర్బ్ ఐతే పొద్దున్నే లేవలేను. ఏ తెల్లారు జామునో నిద్రపడుతుంది. పిల్లలకి స్కూలు కూడా వుంది రేపు" అన్నది శిరీష.

"ఓ.కె. ఓ.కె. ఒక మాటకి పది మాటలు చెప్తావు" అని విసుక్కుంటూ డోర్ లాక్ చేసుకుని స్కూటరెక్కి వెళ్ళాడు రామకృష్ణ.

శిరీష లైటార్పి బెడ్‌లైటు వేసుకుని పడుకుని కాసేపటికే నిద్రలోకి జారుకుంది.

ooo

జంగ్లీ యూసఫ్ ముఠాలో కోవర్ట్ సింగయ్య.

సింగయ్య సింగరాయ కొండ నుంచి సిటీకి వచ్చాడు బ్రతుకు తెరువుకోసం. కొన్నాళ్ళు తమ వూరి వాళ్ళతో పాటు అడ్డాలో నిలబడి కూలి పనులకు వెళ్ళాడు. కూలిపనిలో వచ్చే డబ్బులు తినడానికి చాలకపోవడం, ఆ పని కూడా నెలంతా వుండకపోవడంతో ఇక ఇంటికెళ్ళిపోదామనుకుంటూ వుండగా అబ్దుల్లా అనేవాడు పరిచయమై హోటల్లో కప్పులు కడిగే పనిలో పెట్టాడు. నెమ్మదిగా ప్రమోషన్ వచ్చి సర్వర్ అయ్యాడు. వీడి చలాకీతనం చూసి జంగ్లీ యూసఫ్ ముచ్చట పడ్డాడు. జంగ్లీ యూసఫ్ తొంభై తొమ్మిది దొంగతనాలు చేసీ పోలీసులకు చిక్కని మేధావి వర్గం దొంగ. జంగ్లీ యూసఫ్ మాయలో పడిపోయాడు సింగయ్య. రెక్కీ టీమ్‌లో చేరిపోయాడు.

సిటీలో మారుమూల కాలనీలు తిరుగుతూ వుండాలి. సైకిల్ మీద ఒక ట్రాసుపెట్టుకుని, 'పాత పేపరు కొంటాం' అని రౌండ్లు కొడుతూ ఏ ఇంటికైనా తాళం వేసి వుంటే గుర్తుపెట్టుకుని జంగ్లీకి ఇన్ఫాం చెయ్యాలి. ఆ తర్వాత కథంతా జంగ్లీ నడుపుతాడు. పనిలో పనిగా సింగయ్య మారుతాళం చెవులతో తాళాలు తియ్యడంలో కూడా ప్రావీణ్యం సంపాదించాడు. ఇక అక్కడ్నుంచి తను స్వతంత్రం ప్రకటించుకుని సంపాదించుకోవాలనే దురాశలో పడిపోయాడు.

ఏ ఇంటికి తాళం వేసివుందో కనిపెట్టేది తను, తాళం తీసేది తను. బైట కాపలాకాసేది తను. యూసఫ్‌గాడు లోపలకెళ్ళి ఎంత కొట్టేస్తాడో తెలీదు. తనకి ముష్టి విదిలిస్తాడు. ఇక తను బాగుపడేది ఎప్పుడు?

ఇట్లాంటి ఆలోచనలతో సతమతమవుతూ ఒకరోజు ఫస్ట్‌షోకి వెళ్ళొస్తున్న సింగయ్య కంటికి రామకృష్ణ ఇంటికి తాళం వేసి వుండడం కనిపించింది. సన్నగా చినుకులు పడుతున్నాయి. భారీ వర్షంగా మారే సూచనలు వున్నాయి. కాలనీ నిర్మానుష్యంగా వుంది. ఇంకేం?

సింగయ్య మెదడులో ఫ్లాష్ వెలిగింది. తన కెరీర్‌ని ఇప్పుడే ఎందుకు మొదలుపెట్టగూడదు? అంతా అనుకూలంగా వుంది. కాలం కలిసొచ్చేట్టు వుంది. డబ్బో, బంగారమో దొరికితే దరిద్రం తీరిపోద్ది. హాయిగా ఇంటికెళ్ళి దర్జాగా బతకొచ్చు. చూసినవాళ్ళు హైదరాబాద్‌లో సంపాదించి తెచ్చుకున్నాడని అనుకుంటారు. పిచ్చిజనం కదా!

సింగరాయకొండ మెయిన్ రోడ్డు మీద ఏదైనా షట్టర్ అద్దెకు తీసుకుని హోటల్ మొదలుపెట్టాడంటే ఇక తన దశ తిరిగినట్టే! తనెందుకూ పనికిరానోడని తిట్టిపోసే మేనత్త నోరెళ్ళబెట్టాలి. 'నా పిల్లని చేసుకోరా' అని వెంటపడాలి.

సింగయ్య పెదవులపై చిరునవ్వులు చిందులాడాయి. నెమ్మదిగా కదిలాడు.

ooo

తాళం తీసి లోపలకెళ్ళిన సింగయ్యకి స్విచ్‌బోర్డు కనిపించక తిరుగుతూ టీపాయ్‌కి తగిలాడు. దానిమీదున్న మెటల్ ఫ్లవర్ వాజ్ క్రింద పడి ఖంగున మ్రోగింది.

ఆ చప్పుడుకి శిరీష మేలుకుంది.

"ఏమండీ?" అని పిల్చింది.

సమాధానం రాలేదు. తాళం వేసివున్న ఇంటిలో నుంచి ఎవరో పిలిచిన శబ్దం విని సింగయ్య గుండెలో రాయిపడింది. తాళం వేసిన ఇంట్లో మనుషులుండడం ఏమిటి ఖర్మ? కొంపదీసి దెయ్యం కాదుగదా! అనుకున్నాడు. దెయ్యం ఆలోచన రాగానే గడగడ వణికిపోయాడు. దెయ్యాలంటే సింగయ్యకి చచ్చేంత భయం. ఇక వాడికి కాళ్ళు చేతులు ఆడలేదు. గొంతు ఎండిపోయింది.

రామకృష్ణ నుంచి సమాధానం రాకపోయేసరికి శిరీష లేచి వచ్చి హాల్లో లైటు వేసింది.

ఎదురుగా సింగయ్య కనిపించాడు. శిరీషకి గుండె ఆగిపోయింది.

దెయ్యం కాదు మనిషే అని నిర్ధారణ అయ్యేసరికి సింగయ్యకి తెగింపు వచ్చింది. జేబులో నుంచి రాంబో డాగర్ తీశాడు.

"అరిస్తే! చంపుతా!" అన్నాడు.

తలుపు మూసి బోల్ట్ పెట్టేశాడు.

"చెప్పు, డబ్బు, నగలు ఎక్కడున్నాయి?" అన్నాడు కఠినంగా.

"బెడ్‌రూంలో" వణికిపోతూ అన్నది శిరీష.

"పద" డాగర్ వూపుతూ అన్నాడు.

శిరీష నెమ్మదిగా కదిలింది. ఆమె వీపునకు డాగర్ ఆనించి అడుగులో అడుగు వేస్తున్నాడు సింగయ్య. శిరీష కొప్పులో నలిగిన విరజాజుల పరిమళం సింగయ్య ముక్కులకు తాకి మైమరపిస్తోంది. పసిడివర్ణంలో వున్న శిరీష శరీరం, ఆమె నడుము వంపు చూస్తున్న సింగయ్య కళ్ళు పెద్దవయ్యాయి. ముప్పై మూడేళ్ళ ముగ్ధ శిరీష జఘన సౌందర్యం కదలికలు గమనిస్తున్న సింగయ్యలో మగాడు లేచి అరేబియా గుర్రంలా సకిలించాడు.

ఇక దొంగతనం విషయం మరుగున పడింది. శిరీష అందం అతణ్ణి ఉన్మత్తుణ్ణి చేస్తోంది. బెడ్‌రూమ్‌లోకి వెళ్ళీ వెళ్ళగానే శిరీషను బెడ్ మీదకు నెట్టాడు. డాగర్ చూపిస్తూనే ఆమె మీదకు ఒరిగాడు.

శిరీష రెండు చేతులతో అతణ్ణి బలంగా నెట్టింది. సింగయ్య వెల్లకిలా పడ్డాడు.

శిరీష లేచి నిల్చుంది. సింగయ్య డాగర్ చూపిస్తూ నెమ్మదిగా లేచాడు. అతని ముఖం కోపంతో ఎర్రబడింది.

"ఏం కావాలి నీకు? నేనా? నీతో గడపడం నాకు ఇష్టమే. ఐతే నేను చెప్పినట్లు వినాలి" అన్నది శిరీష.

సింగయ్య బిత్తరపోయాడు. ఆమెను బెదిరించి లొంగదీసుకుని సుఖం అనుభవించాలనుకున్నాడు. సినిమాల్లో చూసినట్లు రేప్ చేయాలనుకున్నాడు. కానీ ఆమే తనను



ఆహ్వాని
స్తోంది. తనకీ ఇష్టమే అంటోంది. ఛాన్స్ అంటే తనదే. అప్సరసల్లాంటి ఆడవాళ్ళని దూరం నుంచి చూడ్డం తప్ప ఎన్నడూ ముట్టుకుని ఎరగడు. ముట్టుకుంటే మాసిపోయే ట్లున్న ఈ ఆడది తనంతట తనే రమ్మనడం అదృష్టం కాక మరేంటి? తంతే గారెల బుట్టలో పడ్డం అంటే ఇదేనేమో? సింగయ్య ముఖంలో కోపం మాయమై ఆనందం తొణికి సలాడుతోంది.

"నువ్వేం తొందరపడకు. నువ్వు తెల్లార్లూ వుండొచ్చు" అన్నది శిరీష.

సింగయ్యకి మతిపోతోంది. ఆనందం హద్దులు మీరు తోంది. ఆమె దగ్గరగా వెళ్ళి నడుం మీద చెయ్యి వేసి దగ్గ రగా లాక్కున్నాడు.

ఆమె విదిలించి కొట్టింది.

"అదే వద్దన్నది" అన్నది.

ముక్కు మూసుకుంది. అసహ్యంగా చూసింది.

"నీ దగ్గర చెమట వాసన. భయంకరంగా వుంది. ఎన్నాళ్ళయింది స్నానం చేసి?" చిరాకుగా అన్నది.

తనను ఆమె దూరంగా ఎందుకు నెట్టేసిందో, ఆమెకు తనంటే ఇష్టమున్నా కోపంగా ఎందుకుందో అర్ధమైంది. అదన్నమాట సంగతి అనుకున్నాడు.

"పొద్దున్నే చేశాను" అన్నాడు.

"పగలంతా తిరిగి వుంటావు గదా! ఎంత చెమట కారుతోందీ? ఆ వాసనంటే నాకు అసహ్యం డోకొ స్తోంది" అన్నది.

సింగయ్య తనని తానే తిట్టుకున్నాడు. 'స్నానం చేసి

సినిమా కెళ్ళాల్సింది' అనుకున్నాడు.

ఐనా ఇటువంటి ఛాన్స్ వస్తుందని తనేం కలగన్నాడా?

"నువ్వు బీరు తాగుతావా?" అడిగింది శిరీష.

గంగిరెద్దులా తలాడించాడు సింగయ్య.

శిరీష ఫ్రిజ్‌లోనుంచి బీర్‌బాటిల్ తీసి మూత విప్పి అతని చేతికి అందించింది. బీర్ బాటిల్ చల్లగా తాగక ముందే కిక్ ఇస్తోంది.

"గ్లాసు కావాలా? అట్లాగే తాగేస్తావా?"

"సీసా ఎత్తి తాగడమే నాకు ఇష్టం"

"నాకూ అంతే" అని శిరీష నవ్వింది.

ఆమె తెల్లటి పలువరస తళుక్కున మెరిసి సింగయ్య దంగైపోయాడు. ఎర్రగా యాపిల్ పళ్లలా వంపులు తిరిగిన పెదవులను తను ముద్దాడబోతున్నాడనే వూహే అతనికి మత్తు కలిగిస్తోంది. కానీ తన దగ్గర చెమట కంపు అని దగ్గరికి రానివ్వడం లేదు. అటువంటిది పెదవుల మీద ముద్దుపెట్టుకోనిస్తుందా? అనే సందేహం పీడిస్తోంది.

సింగయ్య మెదడులో ఫ్లాష్ వెలిగింది. చెమట కంపు పోవాలంటే స్నానం చెయ్యాలి. అంతేగా! స్నానం చేస్తే పోలా? అనుకున్నాడు. ఇక వంట్లోకి హుషారొచ్చింది.

"నువ్వూ బీర్ తాగుతావా?" ఆశ్చర్యపోతూ అడిగాడు.

"ఆ..ఏం చేస్తాను? నన్ను ఇద్దరు పిల్లల్ని వదిలి మా ఆయన దుబాయ్ వెళ్ళిపోయాడు. ఈ వయసులో రాత్రి పూట నిద్రెలా పడుతుంది చెప్పు? ఆ మాట ఆయనకు చెప్తే రోజూ ఒక బీర్ బాటిల్ తాగితే హాయిగా నిద్రపడుతుందని చెప్పాడు. ఇక అప్పుడ్నుంచీ..." అని పక పక నవ్వింది శిరీష.

సింగయ్య సీసా ఎత్తి గడగడ గుటకలు వేశాడు.

"ఆమ్లెట్ వెయ్యనా? జీడిపప్పు తింటావా?" అన్నది.

సింగయ్యకి కిక్ ఎక్కువైపోయి, నరాలు జివ్వుమంటూ మధురమైన అనుభూతికి లోనయ్యాడు. అతని ఆనందానికి హద్దులు లేవు. కలా? నిజమా? అనే సందేహం కలిగింది.

లేకపోతే తనకేంటి? సినిమా హీరోయిన్‌లాంటి ఆడది అప్పనంగా దొరకడం ఏంటి? సింగయ్యకి తన అదృష్టం మీద నమ్మకం ఏర్పడిపోయింది.

ఆమ్లెట్, జీడిపప్పు అనగానే అతనికి ఆకలి గుర్తొచ్చింది.

అతని సమాధానం వినకుండానే శిరీష నిమిషాల్లో ఆమ్లెట్ వేసుకొచ్చి అతనికి అందించింది. సింగయ్య బెడ్ మీద సెటిలైపోయి ఆమ్లెట్ తింటూ బీర్ తాగుతూ, అప్పుడప్పుడూ జీడిపప్పు పలుకులు కొరుకుతూ ఎంజాయ్ చెయ్యసాగాడు.

బీర్‌సీసా ఖాళీ అయింది.

"ఇంకోటి ఇవ్వనా?" అడిగింది శిరీష.

"చెమటకంపు అంటున్నావుగా? స్నానం చేసి వస్తాను. ఏం? ఆ తర్వాత..." అని నవ్వాడు.

"గుడ్ ఐడియా!" అని శిరీష సరికొత్త సోప్ రేపర్ విప్పి అతనికి అందించింది.

"ఇది అమెరికా సబ్బు! మా ఆయన దుబాయ్ నుంచి తెచ్చాడు. భలే సువాసనలే. బాగా రుద్ది రుద్ది స్నానం చెయ్యి. మా ఆయన నైట్ డ్రెస్ వుంది. అది ఇస్తాను. వేసుకో. ఫారిన్‌లో తయారైన సెంట్ కూడా వుంది. అది స్ప్రే చేస్తాను. నువ్వెప్పుడూ అటువంటి వాసన పీల్చి వుండవు" అన్నది శిరీష.

సింగయ్య గాలిలో తేలిపోతూ సబ్బువాసన చూశాడు. అదిరిపోతోంది. శిరీష బాత్‌రూమ్ తెరిచింది. ఇంకేముంది? ఎలుకబోనులో పడింది.

శిరీష తలుపు మూసి నెమ్మదిగా గడియ పెట్టింది.

'హమ్మయ్య' అని శిరీష గుండెల నిండా వూపిరి పీల్చుకుంది.

సెల్‌ఫోన్ తీసుకుని పోలీస్ స్టేషన్‌కి రింగ్ చేసింది.

ooo

స్వర్గసుఖాల ఊహలలో తేలిపోతున్న సింగయ్యకి నీళ్ళ చప్పుడువల్ల పోలీస్ వ్యాన్ శబ్దం వినిపించలేదు. వినిపిస్తే స్వర్గం నుండి జారి భూమి మీద పడేవాడు.

శిరీష సలహా ఇచ్చినట్లు సబ్బు సగం అరిగే వరకూ రుద్దాడు. పూర్తిగా అరగాలంటే ఇంకా చాలా సమయం పట్టేట్లు వుంది. చెమట కంపు పోయిందని రూఢి అయిన తర్వాత ఇక రుద్దడం మానేశాడు.

తలుపు తీయగానే సినిమా హీరోయిన్ లాంటి శిరీష కనిపిస్తుందని ఊహల్లో తేలిపోతూ 'మత్తుమత్తుగా గమ్మత్తుగా వుంది' అని హమ్ చేసుకుంటూ తలుపు తీసుకుని బైటకొచ్చిన సింగయ్యకి ఎదురుగా పోలీసులు కనిపించారు.

సింగయ్య గుడ్లు తేలేశాడు. గదంతా గిర్రున తిరుగుతున్నట్లనిపించింది. గుండె జారిపోయింది. ఆకాశంలో నుంచి జారి అగాథంలోకి పడిపోయాడు.

పోలీసులాఠీలు సింగయ్య నగ్నదేహంపై నాట్యమాడాయి.

"ఎవఁడ్రా! నువ్వు? ఎప్పుడూ తగల్లేదు?" అని అడిగాడు యస్సై.

"ఇదే మొదటిసారి సార్!" వల వల ఏడుస్తూ అన్నాడు సింగయ్య.

యస్సై "అదీ సంగతి" అన్నాడు.

పోలీసులు పకపక నవ్వారు.

ooo

జంగ్లీ యూసఫ్ ముఠా జైల్లో పడింది.

"అరె! బద్మాష్! దొంగతనానికి పోయినప్పుడు ఆడదాని జోలికి పోగూడదురా!" అని లబలబలాడుతూ సింగయ్యని బూతులు తిట్టడం మొదలుపెట్టాడు జంగ్లీ యూసఫ్.

"తప్పయిందన్నా! ఈసారి ఆడదాని జోలికి పోనులే" చెంపలు వాయించుకున్నాడు సింగయ్య.

o

## సుహాసినికి మంచి చాన్స్

యువతార సుహాసినికి మంచి చాన్స్ లభించబోతోందని టాలీవుడ్ తాజా వార్త. బాలకృష్ణ నటించబోయే 'రంగ-పాండురంగ' సినిమాలో అతని సరసన సత్యభామగా సుహాసినికి అవకాశం దక్కబోతోందంటున్నారు. 'చంటిగాడు' సినిమా ద్వారా పరిచయమైన సుహాసినికి ఇంతదాకా టాప్ హీరోలతో నటించే చాన్స్ రాలేదు. ఇప్పుడీ వార్తే గనక నిజం అయితే సుహాసిని కెరీర్ మలుపు తిరిగినట్టే!

